# కొత్త రచయితలు

## లవ్ స్టోరి

## "ముద్దబంతి పూవులో..."

చిన్నప్పట్నుంచి ట్రావెలింగ్ ఓ హాబీ నాకు... అందుకే మా కంపెనీ నుంచి బెస్ట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఎన్నికైన నేను, నాన్ ఫైనాన్షియల్ ఇన్‌సెంటివ్ కింద ఇచ్చే ఛాన్స్ ఉపయోగించుకోవాలనుకున్నాను — 'నేపాల్' వెళ్ళటం ద్వారా... 'ఒక్కడివే ఎందుకు - మేరేజ్ అయిన తరువాత హనీమూన్ ట్రిప్‌గా వెళ్ళచ్చ'ని మా ఎం.డి. చెప్పినా సరే... పట్టుబట్టి బయల్దేరాను నేపాల్ - ట్రావెలింగ్ ఏజన్సీ ద్వారా...

దేశం మొత్తం ఆదాయంలో సగం పైగా టూరిజం ద్వారానే సంపాదించే ఆ దేశంలో మన రూపాయి విలువ 1.68 రూపాయలకి సమానం. అందుకే అక్కడ ఎక్కువగా కన్పించేది ఇండియన్సే...

ఉదయం పదకొండుకి ఖాట్మండు ఏర్‌పోర్ట్‌లో దిగిన నాకు ఆ రాత్రి నుంచి హోటెల్ సోయాల్టి ఒబెరాయ్‌లో రూమ్ కేటాయించింది ట్రావెలింగ్ ఏజన్సీ. మర్నాడు హిమాలయాల మీదుగా ఫ్లైట్ ట్రావెల్ చేశాను. తెలతెలవారుతున్న వేళ కురిసే మంచులో విమానం దూసుకుపోతుంటే కిటికీ లోంచి కన్పించే ఆ వెండికొండల విశృంఖల సౌందర్యం ఓహ్... ఏనాటిదో నా చిన్ననాటి స్వప్నం! ఒళ్ళు జలదరించింది ఓ క్షణకాలం పాటు...

ఆ రోజు సాయంత్రం వరకూ సైట్ సీయింగ్ పేరుతో ఖాట్మండు అంతా తిరిగాను... సాయంత్రం డిన్నర్ అనంతరం కేసినోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. కేసినో అంటే నిజం చెప్పాలంటే - జూదశాల. అక్కడ రకరకాల ఐటెమ్స్ మనల్ని కట్టిపడేస్తాయి. ప్రతి ఒక్కరికీ ఫ్రీగా ఇచ్చే నాలుగు వేల విలువగల ఆ కూపన్స్‌తో కేసినో చేరుకున్నాను నేను. లేడీస్ - జంట్స్... చాలా రష్‌గా వుంది. నా మటుకు ఇండియన్సే ఎక్కువగా కన్పించారు - జీన్స్‌లో, మిడ్డీల్లో, ఫ్రాకుల్లో, సల్వార్ కమీజుల్లో... వెచ్చని షాల్స్ కప్పుకుని, నులివెచ్చని స్వెట్టర్స్‌తో ఇంగ్లీష్ మాట్లాడుతూ...

ఇంచుమించు మూడు వందల రూపాయిలు గెల్చుకోగలిగాను ఫ్రీ కూపన్స్‌తో... ఇక విసుగనిపించి కాసినో అంతా కలియదిరుగుతున్న నాకు ఒక్కసారిగా షాక్ కొట్టినట్లైంది...

దూరంగా ఓ అమ్మాయి పట్టు పరికిణీ ఓణీలో - నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను! ఎక్కడో కొన్ని వందల మైళ్ళ దూరంలో దేశం కాని దేశంలో మళ్ళీ పట్టు పరికిణీ జాకెట్ మాస్తున్నాను!! ఒక పక్కగా నిలబడి ఆమెనే చూస్తుండిపోయాను.

గుండ్రటి ముఖం, నల్లటి కళ్ళు, కొనదేరిన సంపెంగ ముక్కు, లిప్‌స్టిక్ లేని 'జ్యూసీ' పెదవులు - పొడవైన జడ, ఎరుపు ఛాయ కలిసిన నీలి పట్టు లంగాలో, తెల్ల చామంతి వంటి ఓణీలో... పచ్చని శరీర కాంతిగల ఆమె ఎంతో అందంగా మెరిసిపోతోంది. తల తిప్పుకోలేకపోయాను.

ఇంటి దగ్గర ధరించే సంప్రదాయపు దుస్తుల్ని మానేసి, ఇక్కడికి వచ్చిన పెద్ద పెద్ద వాళ్ళే జీన్స్‌లో - టీ షర్టుల్లో కన్పిస్తుంటే - ఈమె అచ్చు సంక్రాంతి ఉషోదయాన కళ్ళాపి చల్లిన ముంగిట రంగవల్లులు తీర్చే ఆడపిల్లలా...!! ఈ మధ్య 'ఖాదీ' బట్టలు ఫ్యాషన్ అయినట్టు - వెరైటీ కోసం వేసుకోలేదు కదా? నాకు అనుమానం రాకపోలేదు.

రౌలెట్స్ ఆడుతున్న వాళ్ళ నాన్న వైపు చూస్తోందామె చిర్నవ్వుతో. పక్కనే ఆమె తమ్ముడు - అమ్మ. యథాలాపంగా తలెత్తిచూసిన ఆమెకు ఎదురుగా నేను! ఆమె వైపే సూటిగా చూస్తూ కనిపించేసరికి చటుక్కున తల తిప్పుకుందామె కంగారుగా - చిన్నగా నవ్వుకున్నాను నేను. ఆ తర్వాత ఆమెను అనుసరించడం మర్చిపోలేదు. చెప్పొద్దూ - వాళ్ళు కూడా ఒబెరాయ్ హోటల్ వైపు నడుస్తుంటే నాకు చెప్పలేని ఆనందం కల్గింది. తర్వాత కూడా నేను వాళ్ళని ఫాలో అవటం మానలేదు. వాళ్ళని ఫాలో అవుతుంటే మరో సంగతి తెల్సింది_ వాళ్ళు స్వచ్ఛమైన ఆంధ్రులని, మా ఏజన్సీ ద్వారానే వచ్చారనీ.

మర్నాడు కూడా నేనామెను అనుసరించాను. ఆమె చూసినపుడల్లా చిరునవ్వు నవ్వే వాడిని. పశుపతినాథ్ ఆలయం దగ్గరా, షాపింగ్ సెంటర్ లోనూ.. ఆమె ఎక్కడ తలెత్తిచూసినా చిరునవ్వుతో నేను..! ఎప్పుడైనా రష్‌లో నేను ఆమె ననుసరించలేకపోతే ఆమె కళ్ళు నా కోసం వెతకటం నే గమనించకపోలేదు!

* * *

తర్వాత చాలాసార్లు నేనామెను పలకరించాలని చూశాను. కాని నా పొడగిట్టనట్టుగా నే పలకరించగానే భయపడుతున్నట్టు చూస్తూ వెళ్ళిపోయే దామె. అలా ఎన్నోసార్లు!

'రివర్ రాఫ్టింగ్ ట్రిప్'లో ఎలాగైనా ఆమెతో మాట్లాడాలనుకున్నాను ఒబెరాయ్ గది ఖాళీ చేస్తూ. ఆ రోజు సాయంత్రం నది ఒడ్డున వేసిన టెంట్స్‌లోంచి బయటకి వచ్చి, అందరూ వెన్నెలనీ, చల్లని గాలినీ ఎంజాయ్ చేస్తున్నారు. ఆమె మాత్రం బయటికి రాలేదు. మర్నాడు కూడా.

ఆ రోజు రాత్రికల్లా ప్రపంచఖ్యాతి సంపాదించిన టైగర్ టాప్స్ అరణ్యాన్ని చేరుకున్న మాకు ఆ అడవిలోనే పూర్తిగా కలపతో నిర్మించిన ఓ లాడ్జిలో బస చేయడానికి ఏర్పాటు చేసింది ట్రావెలింగ్ ఏజన్సీ. ఆ రాత్రి ఆమెకో లెటర్ రాశాన్నేను - తెలుగులో, స్వచ్ఛమైన తెలుగులో! ఎన్నో ఏళ్ళుగా నార్త్‌లో వుండిపోయి ఇంచుమించు మర్చిపోబోతున్న తెలుగులో! మర్నాడు ఆమెకందించాను బ్రేక్‌ఫాస్ట్ టైంలో. మౌనంగా అందుకున్న ఆమె సీరియస్‌గా తన రూమ్‌లోకి వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం వరకూ కనీసం నాకేసి చూడలేదామె. నేనామెను హర్ట్ చెయ్యలేదు కదా?? లోలోపల బాధపడ్డా. మనసంతా అయోమయంలో పడిపోయింది. లెటర్ తీసుకున్నందుకు సంతోషించాలా! సీరియస్‌గా వెళ్ళిపోయినందుకు బాధపడాలా?

* * *

మరుసటి రోజు ప్రోగ్రాం ప్రకారం మెగౌలీ ఎర్‌పోర్ట్‌కి బయల్దేరాలి మేం - ఏనుగుల మీద - ఆ జంగిల్ నుంచి. ఇద్దరు మాత్రమే ప్రయాణం చెయ్యగల ఆ ఏనుగు మీద నేనొంటరిగా! మరోదాని మీద ఆమె! వాళ్ళ అమ్మ, తమ్ముడు ఒక ఏనుగు మీద కనిపిస్తున్నారు. మరి వాళ్ళ ఫాదర్ ఏడి? నే చుట్టూ చూస్తున్నాను. అంత దూరాన కనిపించాడాయన. నే చూస్తుండగానే సరాసరి వచ్చి నా ఏనుగు దగ్గరకే వచ్చాడు. హలో అంటూ ఎక్కి నా వెనుక కూర్చున్నాడు. నా గుండె గొంతుకలోకి వచ్చి కొట్టుకున్నట్లైంది. దీనిపై నుంచి కిందకి తోసెయ్యడు

రచయిత చిరునామా:

వి.ఎస్. రవిచంద్ర

7/288, అప్‌స్టైర్స్, నియర్ మార్కెట్,

గుడివాడ - 521 301



కదా? అనుమానం!

కొద్ది నిమిషాల తర్వాత ఆయన సర్దుకుని ఆ ఏనుగు మీద బ్యాలెన్స్‌డ్‌గా కూర్చుని చెప్పాడు - "బాబూ! నీ పేరేంటో గాని... అమ్మాయి లెటర్ నాకు చూపించింది!"- ఈసారి నాకు నిజంగా తోసేస్తాడనిపించింది ఏనుగుపై నుంచి కిందకి - "ఒక్కగానొక్క కూతురు! అఫ్‌కోర్స్ కొడుకు కూడా. నీకీ పాటికే అన్నీ తెల్సుంటాయనుకుంటాను. కాని చెప్పాల్సిన బాధ్యత నా మీదుంది" చెప్పుకు పోతున్నాడాయన. మౌనంగా వింటున్నాను నేను చాలా కాలం తర్వాత తెలుగుని.

"మాస్టర్ ఆఫ్ ఇంగ్లీష్ లిటరేచర్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన మా 'రమ్య' తన పరీక్షల తర్వాత ఓ పార్టీ నుంచి తిరిగొస్తూ... కార్ ఏక్సిడెంట్‌లో మాట పోగొట్టుకుంది" అంతే - ఓ మిస్సైల్ దూసుకుపోయింది నా గుండెలోంచి... ... ఆయన గొంతులో విషాదపు జీర... నేనింకా నమ్మలేక పోతున్నాను.

"నిజమా...! మాట్లాడలేదా..."

నూతిలోంచి వచ్చినట్టున్నాయి నా మాటలు. అంతకన్నా ఎక్కువగా మాట్లాడలేక పోతున్నాను.

"ఎన్నో లక్షలైతే ఖర్చు పెట్టేందుకు సిద్ధ పడ్డాను కానీ రమ్యకి మాట తెప్పించ లేకపోయాను... డాక్టర్ సలహా మీద స్థలం మార్పుగా వుంటుందని, తనూ కొంత వూరట ఫీలవుతుందని ఇటు తీసుకొచ్చాం" ఈ మాటలు చెప్పేటప్పుడు ఆయన కంఠంలోని ణుకు నేను గమనించక పోలేదు.

"ఇప్పుడు చెప్పుబాబూ - ఇంకా ఆమె చెయ్యందుకోవడం నీ కిష్టమేనా? బలవంతం లేదు. ఆలోచించుకో! నువ్వు ప్రపోజ్ చేసిందే. మాకటువంటి ఆలోచనే లేదు ఇంతవరకూ. నువ్వు కాదన్నా మేమేం బాధపడం - ఆ స్టేజీని మేమెప్పుడో అధిగమించేశాం! ఏ విషయమూ ఖాట్మండులో మళ్ళీ ఢిల్లీ ఫ్లయిట్ ఎక్కేలోపల చెబితే చాలు" అంటూ దిగిపోయాడాయన. మావటివాడెంత చెబుతున్నా వినిపించు కోకుండా.

నేను ఇంకా ఆ షాక్‌లోంచి తేరుకోలేక పోతున్నాను. ఇదంతా ఒక్కసారి అబద్ధమైతే బాగుండునన్న ఆలోచన! పదునైన కత్తి గుండెల్లో గుచ్చి మెలితిప్పుతున్నట్టు ఫీలింగ్... ఇక ఆ ట్రిప్ నేసరిగ్గా ఎంజాయ్ చేయలేకపోయాను. ఆలోచిస్తూనే వున్నాను. నే పలకరించి నప్పుడల్లా ఆమె-ముఖంపై నీలి నీడతో బాధతో, భయంతో ఎందు కెళ్ళిపోయేదో ఇప్పుడర్థమవుతోంది. చాలా విధాలుగా ఆలోచించాను నేను... తల పగిలేలా... రెండు రోజులు... చివరికి ఓ నిర్ణయానికొచ్చాను.

* * *

తర్వాత ఖాట్మండూ ఏర్‌పోర్ట్‌లో లాంజ్‌లో కూర్చున్న వాళ్ళ ఫాదర్‌తో చెప్పాను. "దేఖో సర్ - మీరు చెప్పవల్సింది మీరు చెప్పారు - కాని నేను చెప్పేది ఎప్పుడూ ఒక్కటే - ఐ వాంట్ టు మ్యారీ హర్. హా సర్-ఐ వాంట్ టు వెడ్ హర్!"

అప్రతిభుడై చూస్తున్నాడాయన.

"మా పెళ్ళయిన తర్వాత ఆమె మాటపోతే నేనేం చేయగలిగే వాడ్ని సార్... అలాగే కాపురం చేసేవాడ్ని. ఇదీ అంతే-జస్ట్ కొద్దిగా-కుడి ఎడమలుగా! ఇక భాష అంటారా? మా మధ్య మాట్లాడుకోడానికి భాషే అక్కర్లేదు సర్. వీ కెన్ టాక్ వితవర్ ఐస్... యస్... కళ్ళతో మేం మాట్లాడుకోగలం... వీ కెన్‌సర్టెన్లీ వైబ్రేట్ ఎట్ సేమ్ ఫ్రీక్వెన్సీ! ఇంకేం కావాలి మా మధ్య..."

నా మాటలు పూర్తికాలేదు... ఆయన చెయ్యి పట్టుకున్నాడు ఆర్తిగా... కళ్ళ నిండా నీళ్ళతో... నిశ్శబ్దంగా వుండిపోయాను నేను చాలాసేపు...

"సర్ ఇవిగో నాలుగు టూటీ ఫ్రూటీ ఐస్ క్రీమ్‌లు" చెప్పాడు ఏజన్సీ స్టీవర్డ్ ఇంగ్లీష్‌లో... "నో నాలుగు కాదు ఐదు" చెప్పాడాయన.

మరుసటి నెలలో...

వెచ్చని షాల్ కప్పుకుని అమాయకంగా నన్నానుకొని నిద్రపోతున్న రమ్యతో... హిమాలయాల మీదుగా ఫ్లైట్‌లో నేను మళ్ళీ నేపాల్ - ఖాట్మండూ -

మళ్ళీ మా తొలి పరిచయమైన కాసినోకి... ఎగురుతూ నేను... వాక్‌మన్ హెడ్స్ చెవులకి తగిలించుకుని ఆన్ చేశాను... "ముద్దబంతి పూవులో... మూగకళ్ళ వూసులో" మంద్రంగా మధురంగా! ●